


గిరి విజ్ఞాన సంబరాల్లో ప్రతిభ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఐటీడీఏ ఆధ్వర్యంలో పాడేరులో నిర్వహించిన గిరి విజ్ఞాన సంబరాల్లో మండలంలోని కించుమండ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంగ్లీష్, గణితం సబ్జెక్టు అంశాలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించి పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనపరచడానికి సహకరించిన ఆ పాఠశాల ఇంగ్లీష్, గణిత సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులైన మండ్యాగురు శోభన్ బాబు, కే.నాగభూషణం, కే రాంబాబులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం గెన్ను, డిప్యూటీ వార్డెన్ ఎస్.అప్పలస్వామి, పాఠశాల సిబ్బంది అభినందించారు.



ప్రశంసాపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ఉత్పత్తుల తయారీలో.. ప్రమాణాలు పాటించాలి

బిఐఎస్ జాయింట్ డైరెక్టర్ కె.రాజశేఖర్

ప్రజాశక్తి-పాడేరు: పాలపొడి నుండి క్షిపణుల వరకు ప్రతి ఉత్పత్తికి బిఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) నిర్దేశిత ప్రమాణాలను నిర్ణయిస్తుందని, వాటిని తప్పనిసరిగా పాటించాలని, కేంద్ర ప్రభుత్వం జారే చేసే ఐఎస్ఐ మార్కు ఉన్న వస్తువును మాత్రమే వినియోగించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ కె.రాజశేఖర్ సూచించారు. సోమవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో బిఐఎస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎస్ఐ మార్కు ఆవశ్యకత, బిఐఎస్ ప్రమాణాలను నిర్ణయించే పద్ధతులు, ఫిర్యాదులు చేసే విధానం తదితర వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజల సంక్షేమం, శ్రేయస్సు దృష్ట్యా ప్రతి ఉత్పత్తికి నాణ్యతను నిర్ధారించేందుకు ఐఎస్ఐ విధానం దేశంలో 1947లో ప్రారంభం అయిందని చెప్పారు. ఉత్పత్తులకు ఐఎస్ఐ మార్కు ఉండాల్సిందేనని స్పష్టం చేసారు. ఉత్పతిదారులకు 1950 నుండి లైసెన్సులు జారీ చేయడం మొదలైందని, 1952లో ఐఎస్ఐ బిల్లుకు ఆమోదం లభించిందని తెలిపారు. సుమారు 450 రకాల ఉత్పత్తులకు ప్రస్తుతం ఐఎస్ఐ మార్కు జారీ చేసినట్లు తెలిపారు. 30 వేలకు పైగా ప్రమాణాలను నిర్దేశిం చామన్నారు. సిమెంట్, స్టీలు, చివరికి ఇసుకకు కూడా నిర్దేశిత ప్రమాణాలు ఉన్నట్లు స్పష్టం చేసారు. ఆక్సిజన్, ఎల్పిజి సిలిండర్లు, రెగ్యులేటర్లకు బిఐఎస్ ప్రమాణాలు తప్పనిసరిగా పాటిం చాలన్నారు. పాలపొడి, బిస్కట్లు తయారీకి ఐఎస్ఐ ప్రమాణాలు పాటించాల్సిందేనని సూచించారు. బంగారు ఆభరణాలకు హాల్ మార్క్ తప్పనిసరి అని చెప్పారు. నాణ్యత, తనిఖీ కోసం రాష్ట్రంలో సుమారు 750 ల్యాబొరేటరీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్టాండర్డ్స్ ప్రమోషన్ అధికారి డి.కృష్ణ వీరవర్మ, జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జెడి రాజశేఖర్



వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం నేతలు, భాషా వాలంటీర్లు

పిఒను సరెండర్ చేయాలని వినతి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పాడేరు ఐటిడిఎ పిఓను సరెండర్ చేయాలని అరకువేలి డిప్యూటీ తహసిల్దార్‌కు గిరిజన సంఘం, భాషా వాలంటరీల సంఘం నాయకులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి కె.రామారావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న మాట్లాడుతూ, అల్లూరి జిల్లా ఏజెన్సీ 11 మండలాల్లో ఆశ్రమ, గురుకుల పాఠశాల హాస్టల్స్‌లో విద్యార్థుల మరణాలపై ఐటిడిఎ అధికారులు స్పందించ లేదన్నారు. కళాశాలలో మౌలిక సమస్యలు పరిష్కారం చేయాలని ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ కనీసం స్పందించక పోవడంతో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో గిరిజన విద్యార్థుల మరణాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల వసతి గృహాల్లో గతంలో పని చేసిన హెల్త్ అసిస్టెంట్లను రెన్యువల్ చేసి విద్యార్థుల ప్రాణాలు కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో భాషా వాలంటరీల సంఘం మండల కార్యదర్శి నాగేంద్ర, తాతబాబు, సర్బు, కృష్ణ, సోమన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గర్భిణితో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమీల్ బాషా

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమీల్ బాషా

ప్రజశక్తి-రాజవొమ్మంగి

విధి నిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమీల్ బాషా అన్నారు. ఆదివారం రాత్రి ఆయన రాజవొమ్మంగి, జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పీహెచ్సీల్లో రికార్డులను పరిశీలించారు. వార్డులు, పీహెచ్‌సీ పరిసరాలను సందర్శించారు. రోగులు, మందులు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో మాతా శిశు మరణాలపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సాలించాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు బయట మెడికల్ షాప్ వద్ద నుండి ఎటువంటి మెడిసిన్ కొనరాదని, రోగులకు కావాల్సిన మందులు పిహెచ్‌సిలోనే ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి పిహెచ్సీ వైద్యాధికారి శ్రీదుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టించి పనిచేస్తే మంచి గుర్తింపు

టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: తెలుగుదేశం పార్టీ నాయకులు ఓటరు వెరిఫికేషన్ ను వేగవంతం చేయాలని టిడిపి పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం ఆమె నివాసగృహం కుమ్మరిపుట్టులో పాడేరు, చింతపల్లి మండలాలకు చెందిన క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, బూత్ కమిటీలు, సేవామిత్ర సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటరు వెరిఫికేషన్ ప్రతీ ఒక్కరూ చేయించు కోవాలన్నారు. అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయించాలన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపిని గెలిపిం చేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరే క విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యకులు పోలుపర్తి గోవిందరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్, ఐటిడిపి నియోజక వర్గ అధ్యక్షులు బుద్ధ జ్యోతి కిరణ్, చింతపల్లి మండలాధ్యక్షులు కిల్లో పూర్ణచందర రావు, పాడేరు, చింతపల్లి క్లస్టర్ ఇన్చార్జ డప్పోడి వెంకటరమణ, పాంగి రాము, వంతాల భీమన్న, యూనిట్ ఇంచార్జ్ లు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వరి



వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం నేతలు

మాతృ భాషా వాలంటీర్ల సమస్యలపై

గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: తక్షణమే తమను విధుల్లోకి తీసుకోవాలని మాతృభాష వాలంటీర్ల సంఘం నేతలు గిరిజ సంఘం ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి సోమేల చెల్లయ్యకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను, మాతభాష వాలంటీర్ల సంఘం మండల అధ్యక్షులు వంతల కొండయ్య, గణేష్‌లు మాట్లాడుతూ, రెండు సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్నా పాడేరు ఐటీడీఏ పీవోకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం బాధాకరమన్నారు.పాడేరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ రెన్యువల్ నిమిత్తం హామీలు ఇచ్చి మరచి పోయారన్నారు. మాతృభాష విద్య వాలంటీర్లు సమస్యలపై నివేదికలు ఐటీడీఏ పీవోకు పంపిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాతృభాష విద్యా వాలంటరీలు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు చూపుతున్న విద్యార్థులు

అంతర్జాతీయ చిత్రలేఖన పోటీల్లో

రాజవొమ్మంగి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

కోనసీమ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యాన అమలాపురంలో ఇటీవల నిర్వహించిన 33వ అంతర్జాతీయ బాలల చిత్రలేఖనం పోటీల్లో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారు. ఈ పాఠశాల విద్యార్థులు పూర్ణిమ మహేశ్వరి, లోవకుమారి, గంగాధర్, హారిక, లక్ష్మణ్, పుష్పసాయి, బేబీ బంగారు పతకాలు, మరో 44 మంది విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి కెసిపి మెరిట్ అవార్డులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, చిత్రలేఖనంలో మంచి తర్ఫీదు ఇచ్చిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఎం.కొండబాబును సోమవారం పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసరావ ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిఎంసి చైర్మన్ సిహెచ్.వీరబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

4న సిఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించాలని ప్రతిపాదించడం జరిగినదని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు ఎ. జగన్మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి ఏపీ సీఎం కప్ జిల్లా స్థాయి పురుషులు, మహిళలు వాలీ బాల్ టోర్నమెంటును ఈ నెల 4న అనకాపల్లి జేఎంజే పాఠశాల వాలీ బాల్ గ్రౌండ్స్‌లో ఉదయం 8 గంటల నుండి నిర్వహిస్తారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించిన ఆసక్తి గల క్రీడాకారులు (పురుషులు మరియు మహిళలు) ఏపీ సీఎం కప్ జిల్లా స్థాయి టోర్నమెంటులో పాల్గొనేందుకు సంబంధిత ఇన్చార్జి ఎం.వి.ఎన్ రమేష్ అనకాపల్లి తైక్వాండ్ కోచ్ ఫోన్౦8125416870కు సంప్రదించవచ్చని తెలిపారు. సంబంధిత ఆధార్ కార్డు జిరాక్స్, మూడు ఫోటోస్ నేరుగా హాజరు కావచ్చని తెలిపారు.



దీక్షలో కూర్చున్న నాయకులు

15వ రోజుకు రిలే నిరాహార దీక్ష

- లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్ మద్దతు

ప్రజాశక్తి-పాడేరు: ఐటీడీఏ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 15వ రోజుకు చేరాయి. ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కే.త్రినాథరావు దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 15 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలన్నారు. దీక్షలకు సంపూర్ణంగా మద్దతిస్తున్నామని, ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వాములు అవుతామని వెల్లడించారు. ప్రభుత్వం స్పందించేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తెలిపారు. గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, తక్షణమే హెల్త్ అసిస్టెంట్‌లను ఆశ్రమాల్లో నియమించాలని కోరారు. గిరిజన ఆశ్రమ విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని డిమాండ్ చేశారు. గిరిజనులు, గిరిజన ఉద్యోగులు, గిరిజన ప్రజా ప్రతినిధులపై గౌరవం లేని పాడేరు ఐటీడీఏ పిఒను తక్షణమే సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని, బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ. చిన్నారావు, టి.చిరంజీవి, పి.ప్రకాష్, బత్తిరి నరేష్, గిరిజన సంఘం నాయకులు రాందాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ సుధాకర్

రిసార్ట్స్‌లో పర్యాటకులకు వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-పాడేరుటౌన్: మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన వంజంగి హిల్స్ కు వచ్చే పర్యాటకులకు వంజంగి సమీపంలో ఏర్పాటు చేసిన రిసార్ట్స్ యజమానులు పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా వసతులు సక్రమంగా అందించాలని సిఐ బి.సుధాకర్ ఆదేశించారు. సోమవారం ఆయన రిసార్ట్స్ యజమానులతో సిఐ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ప్రకృతి అందాలు, మంచు మేఘాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు నివాసం ఉండే రికార్డులను సరిగా మెంటినెన్స్ చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రతీ రిసార్ట్‌లో సిసి కెమారాలను ఏర్పాటు చేయాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు తావులేకుండా చూడాలని యజమానులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జి.లక్ష్మణరావు, జి.రంజిత్ కుమార్, రిసార్ట్స్ యజమానులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో గర్భిణులపై ప్రత్యేక దృష్టి

వైద్యాధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రమాదకర గర్భిణులపై వైద్యాధికారులు, ఎఎన్ఎంలు ప్రత్యేక దష్టి పెట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. రంపచోడవరం డివిజన్ పరిధి ఏడు మండలాల్లోని 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లతో సోమవారం కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్యాధికారులు ఇంటింటికి వెళ్లి గర్భిణుల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని ఎవరికైనా రక్తహీనత ఉంటే దానిని నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శీతాకాలంలో పిల్లలకు ట్రాన్సిల్స్ వచ్చే అవకాశం ఉన్నందున వారికి వైద్యం, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందించాలని సూచించారు. అనంతరం గంగవరం మండలం, వాడపల్లి పిహెచ్‌సి వైద్యాధికారిగా పని చేసి విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కాలేజ్‌కి మైక్రో బయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రమోషన్‌పై వెళుతున్న మొగలపూడి సత్యతేజను ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, డిఎంహెచ్ఓ జమీల్ బాషా, ఎడిఎంహెచ్ఓ డాక్టర్ అనూష, పిహెచ్‌సి వైద్యాధికారులు అభినందించారు.



పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న యువతతో కలెక్టర్ సుమిత్‌కుమార్, పిఒ గనోరే తదితరులు

అగ్రి విద్యార్థులకు వ్యవసాయం, మార్కెటింగ్‌పై అవగాహన

మండలంలోని జాగరంపల్లి అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ విద్యార్థులకు వ్యవసాయం, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం జాగరంపల్లి అగ్రికల్చరల్ పాలిటెక్నిక్‌ను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఎడ్యుకేషన్ లోన్లు అందించే విధంగా ఎల్డీఎంలతో సంప్రదించాలన్నారు. ఈ పాలిటెక్నిక్ కాలేజీకి రావాలంటే చాలా దూరంగా ఉందని, కొద్దిగా ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు తెలియజేయగా, కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కళాశాలకు తాగునీరు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు.

యువకులకు పోలీస్ శాఖలో ఉద్యోగాలు

చదువుకొని ఉన్న యువతీ యువకులకు పోలీస్ శాఖలో ఉద్యోగాలు పొందే విధంగా తగు చర్యలు తీసుకొంటున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మండలంలోని పందిరిమామిడి యూత్ ట్రైనింగ్ సెంటర్లో పోలీస్ శాఖలో ఉద్యోగాల కొరకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 257 మంది పురుషులు, 84 మంది మహిళా అభ్యర్థులు పోలీసు ఉద్యోగాల కొరకు శిక్షణ పొందుతున్నారని, వారికి భోజనం, వసతి ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లా ఎస్పి సతీష్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత పరీక్షల్లో ఉత్తీర్ణత పొందిన వారికి రంపచోడవరం వైటీసీలో శిక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, డ్రగ్ కంట్రోల్ అధికారి రవిశంకర్ అన్నయర్, ఏఎస్పి ఆదిరాజ్ సింగ్ రాణా, కమాండెంట్ పి.కిషోర్. సుధీర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శ్రీధర్ చక్రవర్తి, సిఐ సురేష్ బాబు, రాజు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

కేలండర్, డైరీల ఆవిష్కరణ

ప్రజాశక్తి -అనంతగిరి

మండల కేంద్రంలో సోమవారం యుటిఎఫ్ డైరీ, కేలండర్‌లను యూపీఎఫ్ మండల ప్రతినిధులు పుడిగి దేముడు, శెట్టి రాంబాబులు ఆవిష్కరించారు. బాలికల పాఠశాల 1లో ప్రధాన ఉపాధ్యాయురాలు జి.మల్లేశ్వరి, బాలికల పాఠశాల 2లో ఉపాధ్యాయురాలు బి.మంగలు, తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉప తహసిల్దార్ ఎర్ర పాత్రుడు, మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ విస్తరణ అధికారి మల్లేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం యూటిఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. యుటిఎఫ్ మండల ప్రతినిధులు దేముడు. రాంబాబులు మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల అన్ని విధాలుగా పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మల్లేశ్వరరావు, టి.బాలకృష్ణ బి.బాలకృష్ణ లక్ష్మణమ్మ పాల్గొన్నారు..

డుంబ్రిగూడ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పీఆర్‌టియు కేలండర్, డైరీలను ఎంపీపీ బి.ఈశ్వరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అప్పలరాజు, నాయకులు ఎం.శ్రీను, ఎస్ రాజు, వైసిపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి ఎం శ్రీరాములు, మండల అధ్యక్షుడు ఎస్.గోపాల్, బి సింహాచలం, ఉప సర్పంచ్ ఎస్.జగన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ పరిధి, చొక్కానపల్లి గ్రామంలో తోడం రాజు ఐదేళ్లుగా సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని సోమవారం ఎంపిపి కారం లక్ష్మి, రైతు సంఘం, సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి సారవంతమై, భావితరాల వారికి ఉపయోగపడుతుందని, వివిధ వ్యాధులకు మనిషి దూరం ఉండవచ్చని తెలిపారు. రసాయనిక ఎరువులు వాడి పండించిన కూరగాయలు, ధాన్యం, మిర్చి తినడం వలన అనేక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. రైతు సహాయక వేదిక నుంచి భూమిపుత్ర పురష్కారాన్ని, ప్రశంసాపత్రాన్ని అందుకున్న రాజును ఎంపిపి అభినందించారు. రైతు సంఘ నాయకులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ. ఆర్థికంగా వెనుకబడిన గిరిజన కుటుంబంలో పుట్టి ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచే తోడం రాజుకు ప్రభుత్వం నుంచి ఆర్థికంగా సహాయం చేస్తే ఇంకొంత మంది రైతుల చేత ప్రకృతి వ్యవసాయం చేయించవచ్చని తెలిపారు. కలెక్టర్, ఐటిడిఎ పిఒ ఆర్థిక సాయం అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, చిన్నమటపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామ్మూర్తి, గుండెపూడి లక్ష్మణరావు, ఆత్మకూరు కాంతారావు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, నాళ్లరపు చంద్రరావు, నేరిబోయిన రాజు, సున్నం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మిరప తోటను పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ సంతోష్‌కుమార్ తదితరులు

సర్పంచ్‌ల ఆమోదం లేకుండా

హైడ్రో పవర్‌ ప్రాజెక్టు చేపడితే ఊరుకోం


ఆందోళన చేస్తున్న గిరిజన సర్పంచ్‌లు

ప్రజాశక్తి -హుకుంపేట :తరాలుగా అడవి తల్లిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులను ఏజెన్సీ నుంచి వెళ్లగొట్టేందుకు మన్యాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి హైడ్రో పవర్‌ ప్రాజెక్టుల నిర్మాణాలకు ప్రభుత్వాలు పూనకుంటున్నాయని మండలంలోని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లకు తెలియకుండా, వారి ఆమోదం లేకుండా హైడ్రో పవర్‌ ప్రాజెక్టులు చేపట్టరాదంటూ సోమవారం స్థానిక మండల పరిషత్‌ వద్ద ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు పెనుమల రంజిత్‌కుమార్‌. రేగం రమేష్‌ విలేకర్లతో మాట్లాడుతూ చింతపల్లి, కొయ్యూరు మండలాల సరిహద్దు ప్రాంతమైన గొందిపాకల పంచాయతీ సమగిరి, ఎర్రవరం సమీప అటవీప్రాంతంలో హైడ్రో పవర్‌ ప్రాజెక్ట్‌ నిర్మాణం చేపట్టాలన్న వైసిపి ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. దీన్ని సర్పంచ్‌లంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు.కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి లేకుండా, ఏజెన్సీ నిబంధనలన్నీ తుంగలో తొక్కి, గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ అనుమతులతో హైడ్రో పవర్‌ ప్రాజెక్ట్‌ నిర్మాణం చేపడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సర్పంచ్‌ల అనుమతి, గిరిజనుల ఆమోదం లేకుండా ప్రాజెక్టు పనులు చేపడితే ఉద్యమించక తప్పదని స్పష్టం చేశారు. సర్పంచులు బాకూరు వెంకటరమణరాజు, తామర్ల సత్యనారాయణ. నైని సన్నిబాబు, సమీడ వెంకటపూర్ణిమ, సోమేలి సత్యవతి, పద్మ కుమారి పాల్గొన్నారు

అన్నసమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు, ప్రజలు

ప్రజాశక్తి -చింతూరు : మండల కేంద్రంలోని కోదండ రామాలయం వద్ద సోమవారం ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఎయు జర్నలిజం విభాగాధిపతిగా వినయ్‌కుమార్‌


ఉత్తర్వులు స్వీకరిస్తున్న వినయ్‌కుమార్‌

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వ విద్యాలయం జర్నలిజం విభాగాధిపతిగా డాక్టర్‌ సిఎం.వినయ్‌కుమార్‌ నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్‌ ఆచార్య వి.కృష్ణ మోహన్‌ సోమవారం వినయ్‌కుమార్‌కు ఉత్తర్వులు అందించారు. అనంతరం ఆయన విభాగంలో బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్‌ను విభాగ ఆచార్యులు డివిఆర్‌ మూర్తి, సిహెచ్‌.రామకృష్ణ, టి.విజయలక్ష్మి అభినందించారు.

నేటి నుంచి జర్నలిస్టుల స్పోర్ట్స్‌ మీట్‌

ప్రజాశక్తి - కలెక్టరేట్‌ (విశాఖపట్నం) : వైజాగ్‌ జర్నలిస్టుల ఫోరం, సిఎంఆర్‌, విస్జా ఇంటర్‌ మీడియా స్పోర్ట్స్‌ మీట్‌ను మంగళవారం నుంచి ఈ నెల 12 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. సోమవారం విజెఎఫ్‌ ప్రెస్‌క్లబ్‌లో కార్యదర్శి దాడి రవి కుమార్‌, ఉపాధ్యక్షులు ఆర్‌.నాగరాజ్‌ పట్నాయక్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ విశాఖ స్పోర్ట్స్‌ జర్నలిస్టుల అసోసియేషన్‌ సౌజన్యంతో ఈ మెగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు నుంచి ఇండోర్‌ స్పోర్ట్స్‌, 5 నుంచి 12 వరకు క్రికెట్‌ మెగా పోటీలు ఉంటాయన్నారు. ఇండోర్‌కి సంబంధించి టగ్‌ ఆఫ్‌ వార్‌, అథ్లెటిక్స్‌, షటిల్‌, క్యారమ్స్‌ పోటీలు నిర్వహిస్తుండగా క్రికెట్‌లో మొత్తం 11 జట్లు పాల్గొంటున్నాయని వివరించారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు పోర్టు అవుట్‌ డోర్‌ మైదానంలో ఈ పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. విస్జా అధ్యక్షులు ఉమా శంకర్‌బాబు, ఉపాధ్యక్షులు ఎన్‌.నాగేశ్వరరావు జట్ల వివరాలను ప్రకటించారు. కార్యక్రమంలో కోశాధికారి మూర్తి, నానాజీ, ఇరోతి ఈశ్వరరావు, గిరిబాబు, ఎంఎస్‌ఆర్‌.ప్రసాద్‌, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ వితరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్‌ (విశాఖపట్నం) : పాత నగరంలోని 39వ వార్డు పరిధి శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థకు సిఎంఆర్‌ సంస్థ అంబులెన్స్‌ను సమకూర్చింది. సోమవారం జరిగిన కార్యక్రమంలో సిఎంఆర్‌ అధినేత మావూరి వెంకట రమణ జెండా ఊపి అంబులెన్స్‌ను ప్రారంభించారు. మట్టపల్లి చలమయ్య ట్రస్టు అధ్యక్షులు మట్టపల్లి హనుమంతరావు, శ్రీ వివేకానంద సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, సభ్యులు సత్తిబాబు, గజపతి స్వామి పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు వినతి

ప్రజాశక్తి-పాడేరు: మూఢాచారాలతో జీవిస్తున్న వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలని దళిత మహిళా శక్తి ఉత్తరాంధ్ర అధ్యక్షురాలు జి. మరియమ్మ, అనంతగిరి మండలం కోరపర్తి గ్రామానికి చెందిన కాదల రామకృష్ణ, తెలగాలపాడు గ్రామానికి చెందిన లక్ష్మి, చిన్నపాక గ్రామానికి చెందిన కందుల బాబురావు సోమవారం డిఆర్‌ఓను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆర్మన్‌ గరువు, చింతపాక, బల్లగరువు, మల్లంపేట గ్రామాలలో కొందరు మహిళలు మూఢాచారాల్లో ఉన్నారని తెలిపారు. వీటి ద్వారా వచ్చే ఆదాయంతోనే బతుకుతున్నట్లు వారు చెపుతున్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం తరుపున ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు.

5 నుంచి సోషల్‌ ఆడిట్‌ గ్రామసభలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఉపాధి హామీ సోషల్‌ ఆడిట్‌ గ్రామసభలు ఈ నెల 5 నుండి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సచివాలయ సిబ్బంది, శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో బాపన్నదొర, ఉపాధి హామీ ఏపీఓ సురేష్‌ కుమార్‌ మాట్లాడుతూ 2020 ఏప్రిల్‌ 1 నుండి 2021 మార్చి 31 వరకు, 2021 ఏప్రిల్‌ 1 నుండి నుండి 2022 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన సోషల్‌ ఆడిట్‌ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రామసభలకు నియమించిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈనెల 5న శరభవరం, దొడ్డి, దూసర పాము, వంచంగి, వాతంగి, కింద్ర గ్రామ సచివాలయ వద్ద, 6న జడ్డంగి, చెరుకుంపాలెం, లాగరాయి సచివాలయాల వద్ద, 9న బడదనాంపల్లి, కొండపల్లి, అమీనాబాద్‌, తంటికొండ, కిర్రాబు, లబ్బర్తి, చికిలంత, మారేడుబాక, రాజవొమ్మంగి, గడుఓకుర్తి గ్రామ సచివాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ గ్రామ సభల్లో ఆయా గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు తమ సమస్యలు తెలపవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బర్దన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - కలెక్టరేట్‌ (విశాఖపట్నం) : సిపిఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎబి.బర్దన్‌ ఏడో వర్ధంతిని సోమవారం విశాఖలోని సిపిఐ కార్యాలయంలో ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీకి, దేశానికి బర్దన్‌ చేసిన సేవలను కొనియాడారు. నేటి తరం నాయకులు, కార్యకర్తలు ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. పార్టీ నేతలు ఎస్‌కె.రెహమాన్‌, ఎం.మన్మథరావు, జి.కాసులరెడ్డి, ఎన్‌.నాగభూషణం పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం.!

- కల్వర్టుల నిర్మాణానికి గోతులు తీసి వదిలేసిన కాంట్రాక్టర్‌
- పట్టించుకోని ఆర్‌అండ్‌బి అధికారులు
- హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేయని వైనం
- ఆందోళన చెందుతున్న వాహనదారులు


ప్రమాద హెచ్చరికలు లేని నిర్మాణంలో ఉన్న కల్వర్టు

ప్రజాశక్తి -సీలేరు : మండలంలోని ప్రధాన రహదారిలో నిర్మాణంలో ఉన్న కల్వర్టుల వద్ద ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టుల నిర్మాణాలను కోసం జెసిబిలతో పెద్ద గోతులు తవ్విన కాంట్రాక్టర్‌, వెంటనే పనులు చేయకుండా వదిలేయడం, కనీసం ఎటువంటి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారముందని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బి అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. దీనికి సంబంధించిన వివరాలివి.

జీకే వీధి మండలం సీలేరు నుంచి దుప్పిలివాడ పంచాయతీ చల్లని శిల్ప వరకు గోతులమయమైన ప్రధాన రహదారి పునర్నిర్మా 1ణంతోపాటు మధ్యలో 15 కల్వర్టుల నిర్మాణానికి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. పనులు మొదలెట్టిన సంబంధిత కాంట్రాక్టర్‌, కల్వర్టుల వద్ద జెసిబితో పెద్దగోతులు తవ్వి, పనులు మొదలెట్టి పూర్తిచేయకుండానే వదిలేశారు. కొన్నాళ్ళుగా పనులు ప్రారంభించకపోగా, కల్వర్టు గోతుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. వీటిల్లో అనేక కల్వర్టులు రోడ్డు మలుపుల వద్ద ఉండడంతో ఏమాత్రం గతితప్పినా ప్రమాదానికి గురికావడం ఖాయమని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఇదే రహదారిలో విశాఖపట్నం, భద్రాచలానికి బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా నైట్‌ సర్వీసు బస్సులే ఎక్కువగా ఉండడంతోరాత్రి వేళ ప్రయాణంలో ఎక్కడ, ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కల్వర్టుల కోసం భారీ గోతులే తీసి వదిలేయడంతో ఏమాత్రం ప్రమాదం జరిగినా ప్రాణాలు గాల్లో కలిసిపోవడం ఖాయమని అంటున్నారు. దీనిపై చింతపల్లి డివిజన్‌ ఆర్‌అండ్‌బి అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై మండిపడుతున్నారు.


భారీ గొయ్యి తవ్వడంతో ఇరుకుగా మారిన మలుపులోని కల్వర్టు

ఈ మార్గం గుండా ఇరువైపులా మైదానం నుంచి ఏజెన్సీకి బస్సులు, ఇతర వాహనాలతోపాటు బైక్‌లు, ఆటోలు, జీపులు ఇతర వాహనాలు కూడా భారీ సంఖ్యలోనే రాకపోకలు సాగిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని దారకొండ దుప్పిలివాడ, చల్లని శిల్ప సీలేరు ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌ అండ్‌ బి అధికారులు తక్షణ చర్యలు చేపట్టి కల్వర్టు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు. అంతకు ముందు నిర్మాణాలకు కల్వర్టుల నిర్మాణాలకు తీసిన గోతుల వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు హెచ్చరికలు జారీచేసి, పనులు పున:ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జోరుగా పింఛన్ల పంపిణీ


జి.మాడుగులలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపిటిసి

ప్రజాశక్తి- జిమాడుగుల: మండలంలోని పెదలువ్వాసింగి పంచాయతీ కేంద్రంలో ఎంపిటిసి సన్యాసిదొర, సర్పంచ్‌ ఆధ్వర్యంలో పంపిణీ చేపడుతున్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్‌ నేత కొండపల్లి సత్యనారాయణ, ఉపసర్పంచ్‌ గబ్బాడి గణపతి, మాజీ సర్పంచ్‌ గబ్బాడి పండుదొర ఎఎంసి డైరెక్టర్‌ కోరాబు ఈశ్వర్‌ పడాల్‌, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

1దుంబ్రిగుడ: వైసిపి పార్టీతోనే రాష్ట్రంలోని వయో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు భరోసా ఉంటుందని స్థానిక సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన నూతన పెన్షన్‌లను వైస్‌ ఎంపీపీ ఎస్‌.ఆనంద్‌తో కలిసి లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వం రూ.250 చొప్పున పింఛను ఇచ్చేదని, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం రూ.2750 చొప్పున చెల్లిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఏం.వినోద్‌ కుమార్‌, వార్డు సభ్యులు కే.బలరామ్‌, వాలంటీర్లు కే కృష్ణారావు, కే.గోవర్ధన్‌, ఎం.కిరణ్‌, ఎస్‌.సుమన్‌, ఎమ్‌.రాజు, పి.లలిత గ్రామస్తులు పాల్గొన్నారు.


దుంబ్రిగుడలో పింఛన్లు పంపిణీ చేస్తున్న హరి

కోరం లేకుండానే మండల సమావేశం


శాఖల వారీ నివేదిక వెల్లడిస్తున్న అధికారి

ప్రజాశక్తి -హుకుంపేట : మండల పరిషత్‌ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి కూడ రాజబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాలంటే కోరం పూర్తయ్యేలా ఎంపిటిసి సభ్యులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, సోమవారం నిర్వహించిన మండల సభలో ఏడుగురు ఎంపిటిసిలు గైర్హాజరుతో మిగిలిన ఎంపిటిసిలు, సర్పంచ్‌లతో కోరం లేకుండానే మండల సమావేశం అయిందనిపించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు అజెండా ప్రకారం శాఖలవారీ వివరాలను మండల సభలో వెల్లడంచారు. గ్రామస్థాయిలో సమస్యలు, అందుబాటులో ఉన్న నిధులు, అభివృద్ధి పనులపై చర్చించారు. సమావేశంలో ఎంపిడిఒ ఆర్‌.వెంకటరావు, తహశీల్దార్‌ రాజ్యలక్ష్మి, ఎంఇఒ ఎస్‌.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్‌ జెఇ రమేష్‌బాబు, సిడిపిఒ సిహెచ్‌.బాలామణి, గిరిజన సంక్షేమ విభాగం జెఇ ధృవ, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, హౌసింగ్‌, పంచాయతీ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


హాజరైన ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు

ఆదమరిస్తే అంతే సంగతులు..!

- ప్రధాన రహదారి వెంబడి భారీ లోయ
- పొంచి ఉన్న ప్రమాదం.. కానరాని రక్షణ చర్యలు
- ఆందోళన చెందుతున్న వాహనదారులు, ప్రజలు


అంచుల్లో కోతకు గురైన రోడ్డు వెంబడి ఉన్న భారీలోయ

ప్రజాశక్తి -జిమాడుగుల : మండల కేంద్రం నుండి కోరాపల్లి పంచాయతీకి వెళ్లే మార్గంలో రోడ్డు వెంబడి ఉన్న భారీలోయ భీతిగొలుపుతోంది. రోడ్డుకు ఒకవైపున ఉన్న సుమారు 50అడుగుల లోతు లోయ ఉన్నప్పటికీ, ఆ పక్క ఎటువంటి రక్షణ చర్యలు లేవు. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అంచు కోతకు గురై ప్రమాదభరితంగా మారిందని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఏమాత్రం ఆదమరిస్తే, భారీలోయలోకి వాహనాలు దూసుకుపోవడం ఖాయమని, ప్రమాదతీవ్రత ఊహించుకోవడానికే ఒళ్లు గగుర్పొడుస్తోందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు.

కోరపల్లి పంచాయతీలోని కిటుముల, బొడ్డగుంది, గన్నెలబా, జాంగిరి, లోవాసింగి, సొంగులోయి, గ్రామాలకు వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి కావడం, ఈ మార్గంలో నిత్యం బైక్‌లతోపాటు, ఇతర వాహనాల రాకపోకలు ఎక్కువగానే ఉంటున్నాయని అంటున్నారు. ఈ రహదారిలో అదుపు తప్పితే అంతే సంగతుల అన్నట్టు భయంకరంగా ఉందని ఆవేదన చెందుతున్నారు. రోడ్డు అంచులో భారీ లోయ ఉన్న వైపు మట్టి కొట్టుకుపోవడంతో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు భీతిల్లుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి, ప్రజల ప్రాణాలు పోకముందే సంబంధిత అధికారులు స్పందించాలని, లోయ ఉన్న వైపున రోడ్డు వెంబడి రక్షణ చర్యలతోపాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అదే సమయంలో ఇప్పటికే ప్రారంభమైన రోడ్డు అంచు కోత నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

షిప్‌యార్డుకు భారీ నౌక నిర్మాణాల ఆర్డర్‌..?

మార్చిలోగా రూ.25 వేల కోట్ల ఎఫ్‌ఎస్‌ఎస్‌లకు అనుమతులు

మరో 12 ఏళ్ల వరకూ హెచ్‌ఎస్‌ఎల్‌ మనుగడకు ఢోకాలేనట్టే

ప్రజాశక్తి - గ్రేటర్‌ విశాఖ బ్యూరో

హిందుస్థాన్‌ షిప్‌యార్డు లిమిటెడ్‌ (హెచ్‌ఎస్‌ఎల్‌)లో పదేళ్లుగా నలుగుతున్న ఫ్లీట్‌ సపోర్టు షిప్‌ (ఎఫ్‌ఎస్‌ఎస్‌)ల ఆర్డర్ల వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుమారు రూ.25 వేల కోట్ల విలువ చేసే ఫ్లీట్‌ సపోర్టు షిప్‌ల ఆర్డర్లు తుదిదశలో ఉన్నట్లు తెలుస్తోంది. కేబినెట్‌ కమిటీ ఆన్‌ షిప్‌యార్డ్సు (సిసిఎస్‌) చర్చల్లో తాజాగా ఈ ఆర్డర్ల విషయం తుది దశకు చేరిందని సమాచారం. తాజా వ్యవహారాన్ని ఈ ఏడాదిలో నిజంగా హిందుస్థాన్‌ షిప్‌యార్డుకు మహర్దశను తెచ్చిపెట్టే విషయంగానే షిప్‌యార్డు ఉద్యోగులు, అధికారులు భావిస్తున్నారు. ఫిబ్రవరి - మార్చిలో పూర్తిస్థాయిలో ఈ ఆర్డర్‌లను నౌకా నిర్మాణ సంస్థ దక్కించుకునే వీలున్నట్లు స్పష్టమవుతోంది. నౌకల నిర్మాణం, రిపేర్లలో వైజాగ్‌ షిప్‌యార్డుకు ప్రపంచ స్థాయిలో పేరెన్నికగల సంస్థగా గుర్తింపు ఉంది. స్వాతంత్య్రానికి పూర్వమే అంటే 1941 జూన్‌ 21న షిప్‌యార్డుకు శంకుస్థాపన జరిగింది. దేశంలోనే తొలి నౌకా నిర్మాణ కేంద్రమిది. 1961లో పూర్తిస్థాయిలో దీన్ని కేంద్రం హిందుస్థాన్‌ షిప్‌యార్డు అనుబంధ పరిశ్రమగా గుర్తించింది. 2010లో రక్షణ శాఖకు షిప్‌యార్డు బదిలీ అయ్యింది. 177 నౌకలను నిర్మించగా 2 వేల నౌకల రిపేర్లను షిప్‌యార్డు ఈ 75 ఏళ్లలో చేపట్టి మంచి గుర్తింపును తెచ్చుకుంది. ఎంత ఖ్యాతి గడించినా సరే సరైన ఆర్డర్లు లేకపోవడంతో ఇంత పెద్ద భారీ నౌకా నిర్మాణ పరిశ్రమ ఖాయిలా పడిన సంస్థగా మారిపోయింది. గతంలో 10 వేల మంది వరకూ పర్మినెంట్‌ సిబ్బంది, ఉద్యోగులు పనిచేసేవారు. తాజాగా ఉద్యోగులు స్టాఫ్‌ అండ్‌ వర్క్‌మెన్‌ (అధికారులతో సహా) 1100 మంది వరకూ ఉండగా ఎల్‌ అండ్‌ ఎం సిరీస్‌లో 3372 మంది కార్మికులు పనిచేస్తున్నారు.

ఎఫ్‌ఎస్‌ఎస్‌లతో ఆర్థిక పరిపుష్టి

తాజాగా ఎఫ్‌ఎస్‌ఎస్‌ల ఆర్డర్‌గనక ఆచరణ రూపం దాల్చితే దీర్ఘకాలంలో షిప్‌యార్డు నిలదొక్కుకోవడానికి వీలుంది. వచ్చే 12 ఏళ్లకు సరిపడా లాభాలు, ఆర్థిక పరిపుష్టి ఈ రూ.25 వేల కోట్ల 5 ఎఫ్‌ఎస్‌ఎస్‌లతోనే సాధ్యమని, ఈ ఏడాది మార్చిలోగా ఆర్డర్లు ఫైనల్‌ కానున్నాయని షిప్‌యార్డు ఉన్నతాధికారులు చెబుతున్నారు. కాగా, ప్రతి సంవత్సరం షిప్‌యార్డుకు లాభాలొస్తున్నప్పటికీ ఫ్రెష్‌ ఫైనాన్షియల్‌ రీస్ట్రక్చర్‌ పెండింగ్‌లో ఉంది. అంటే షిప్‌యార్డు పరిభాషలో నెగెటివ్‌ నెట్‌వర్క్‌లో షిప్‌యార్డు కొనసాగుతోంది. ఇలా సుమారు రూ.1000 కోట్ల మేర వడ్డీలు, పాత అప్పుల రూపంలో చూపిస్తున్నారు. ఫ్లీట్‌ సపోర్టు షిప్‌ (ఎఫ్‌ఎస్‌ఎస్‌) తక్షణ ఆదాయార్జన కోసం డ్రైడాక్‌లో రిపేర్‌లు, సబ్‌మెరైన్‌ రీఫిట్‌లుకంపెనీకి కీలకంగా ఉన్నాయి.

5 ఎఫ్‌ఎస్‌ఎస్‌ల ఆర్డర్‌ ఏ సంస్థతో అంటే..

హిందుస్థాన్‌ షిప్‌యార్డు లిమిటెడ్‌ నౌకల నిర్మాణ విషయంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలు తొలుత హుండయ్‌తో చర్చలు జరిపారు. తాజాగా అగ్రిమెంట్‌ మాత్రం టర్కీ దేశానికి చెందిన అనడోల్‌ షిప్‌యార్డుతో కుదుర్చుకున్నట్లు భోగట్టా.

పింఛన్లు పంపిణీ చేస్తూ మహిళా వాలంటీరు హఠాన్మరణం


మాతే వరహాలమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -జిమాడుగుల : మండలంలోని గడుతూరు పంచాయతీ గొంపం గ్రామ మహిళా వాలంటరీ మాతే వరహాలమ్మ ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందింది. విధి నిర్వహణలో భాగంగా ఉదయం నుంచే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వరహాలమ్మ, సాయంత్రం ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలి, అక్కడికక్కడే మతి చెందింది. అనారోగ్యంతో ఇటీవల పాడేరు ఆసుపత్రిలో నెల రోజులపాటు చికిత్స పొందిన వరహాలమ్మ కోలుకుని వచ్చిన తర్వాత విధుల్లో చేరింది. ఈ క్రమంలో పింఛన్లు పంచుతూనే హఠాన్మరణం పాలైంది. వాలంటీరు వరహాలమ్మ మృతిపై ఎంపిడిఒ లోహిత్‌ జైసాగర్‌,ఇఒపిఆర్‌డి రమేష్‌, తోటి వాలంటీర్లు సంతాపం ప్రకటించారు.

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం

ఐటిడిఎ పిఒ సూరజ్‌ గనోరే


సమస్యల అర్జీలను స్వీకరిస్తున్న పిఒ సూరజ్‌ గనోరే, సబ్‌ కలెక్టర్‌ శుభం బన్సల్‌

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని మారమూల గ్రామాల నుంచి వచ్చే గిరిజనులు అందజేస్తున్న స్పందన అర్జీలను సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఎలో నిర్వహించిన స్పందనలో పిఒతోపాటు రంపచోడవరం సబ్‌కలెక్టర్‌ శుభం బన్సల్‌, ఐటిడిఎ ఎపిఒ సిహెచ్‌.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొని అర్జీలు స్వీకరించారు. వ్యక్తిగత, సామాజిక అవసరాలకు సంబంధించి 25వినతులురాగా, వాటిని పరిశీలించిన అధికారులు కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటి పరిష్కారానికి హామీనిచ్చారు. ఈవారం వచ్చిన అర్జీలలో ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ అమలు, ఉద్యోగాల కల్పనకు సంబంధించి అర్జీలు ప్రధానంగా రాగా, వీటితోపాటు రంపచోడవరం సాయినగర్‌లో భూసమస్య పరిష్కరించాలని మడి తమన్నాదొర వినతి అందజేశాడు. దేవీపట్నం మండలం కొండమొదలు పంచాయితీ కె.గొందూరులో పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులైన గిరిజనేతరులకు ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీకి సంబంధించిన ఇళ్లు మంజూరు చేయాలని ముళ్ళ వెంకటలక్ష్మి దరఖాస్తు సమర్పించారు. దేవిపట్నం మండలంలో పోలవరం ప్రాజెక్టు వల్ల గోదావరి నీటి ముంపునకు గురైన పూడిపల్లిలో సుమారు 40 మందికి ఇళ్లు నిర్మించాలని పిఎన్‌వి.పోసిబాబు, పి.రమేష్‌, కె. మణికంఠ వినతి అందజేశారు. కార్యక్రమంలో ఇఇలు నాగేశ్వరరావు, ఎండి యూసఫ్‌, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, ఎఎండిహెచ్‌ఒ డాక్టర్‌ అనూష. ఏరియా ఆస్పత్రి సూపరెంటిండెంట్‌ డాక్టర్‌ కల్పన, డాక్టర్‌ రాధిక. వెటర్నరీ డాక్టర్‌ గోపిక, పిహెచ్‌ఒ కె.చిట్టిబాబు, మలేరియా విభాగం అధికారి రామకృష్ణ, సిడిపిఒ సంధ్యారాణి, ఎంపిడిఒ ఎంవిఆర్‌ కుమార్‌బాబు, డిఇఇలు సాయిసతీష్‌, రాజేంద్రబాబు, దుర్గాప్రసాద్‌, పిఎఒ రాంబాబు, ఏడిఎలు సిహెచ్‌ కెవి చౌదరి, సావిత్రి, ఏజెన్సీ డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్‌ ఎంవివి.రమణ, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌ కిషోర్‌, డివిజినల్‌ సివిల్‌ సప్లై అధికారి సిశ్రీహరి, డిటి తాతారావు. రవీంద్రబాబు, చైతన్యబాబు, విశ్వనాథం, సబ్‌ కలెక్టర్‌ కార్యాలయ పరిపాలనాధికారి యం.సావిత్రి పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం, సీలేరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 35 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం రామన్న వెల్లడించారు. విద్యా కమిటీ చైర్మన్‌ నీతూ, విద్యార్థులు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసిన హెచ్‌ఎం, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని హెచ్‌ఎం కోరారు.

సీలేరు గురుకుల పాఠశాలలో...

సీలేరులోని ఎపి గురుకుల పాఠశాలలో68మంది 8వ తరగతి విద్యార్థులకు ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి ట్యాబ్‌లను పంపిణీ చేశారని ప్రిన్సిపాల్‌ వెంకటరమణ వెల్లడించారు. విద్యార్థులకు డిజిటల్‌ విధానంలో విద్యాబోధనను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వీటిని అందజేసిందని, విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ కె.వల్లిప్రసాద్‌,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: ప్రస్తుత విద్యా రంగంలో మారుతున్న టెక్నాలజీని గిరి విద్యార్థులు అందిపుచ్చుకుని ముందుకు వెళ్లాలని మండలంలోని కొర్రాయి పంచాయతీ సర్పంచ్‌ పూజారి కొములు సూచించారు. ఆ పంచాయతీ పరిధిలోని జాంగుడా బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,ప్రతి ఒక్క విద్యార్థి కంప్యూటర్‌పై ప్రత్యేక పరిజ్ఞానం సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఈ విధంగా ప్రభుత్వం కూడా ప్రోత్సహించడం ఎంతో ఆనందకరమని, గిరి విద్యార్థులు వీటిని సద్వినియోగ పరచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైస్‌ ఎంపీపీ పి.లలిత, ఉప సర్పంచ్‌ జగన్నాథం, వైసిపి కన్వీనర్‌ కే.సింహాద్రి, వార్డు సభ్యులు అప్పన్న, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సుజాత, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన స్కూటీ

ఒకరు దుర్మరణం, ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - పాడేరు టౌన్‌: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు తలారిసింగి వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరు యువకులు తీవ్రగాయాలకు గురయ్యారు. సంఘటనకు సంబంధించిన వివరాలివి.

హుకుంపేట మండలం దిగుడుపుట్టు గ్రామానికి చెందిన గడ్డంగి ఈశ్వరరావు(25), గుల్లెల సాయికుమార్‌, త్రినాథ్‌ అనే ముగ్గురు యువకులు స్కూటీపై పాడేరు వస్తుండగా, తలారిసింగి సమీపంలో ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను దాటి వెళ్లే ప్రయత్నంలో ఎదురుగా వేరొక ద్విచక్రవాహనం రావడం గమనించి, ట్రాక్టర్‌ను ఢీకొట్టి పడిపోయారు. ఈ ప్రమాదంలో ఈశ్వరరావుకు బలమైన గాయం కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన పాడేరు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. సంఘటనపై ఎస్‌ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టానికి పాడేరు ఆసుపత్రి మార్చురీకి తరలించారు.